క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈనెల 13న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని టీఎస్ ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ సాంబరెడ్డి తెలిపారు. న్యూ శాయంపేట, హంటర్‌రోడ్డు, జులైవాడ, ప్రకాశ్‌రెడ్డి పేట, నంది హిల్స్, మచిలీబజార్, కాపువాడ, ఉజ్జిబేస్, వేయి స్తంభాల దేవాలయం, అలంకార్ సర్కిల్ ప్రాంతాల్లో ఉదయం 8గంటల నుంచి 11గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

'టాస్' లీగల్ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలిగా అన్నపూర్ణ



వరంగల్ లీగల్: హనుమకొండ జిల్లా కోర్టులో న్యాయవాదిగా పనిచేస్తున్న గాదెపాక అన్నపూర్ణను తెలంగాణ అంబేడ్కర్ సంఘం (టాస్) లీగల్ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలిగా నియమిస్తూ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జన్ను నర్సయ్య నియామక ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా అన్నపూర్ణ మాట్లాడుతూ అంబేడ్కర్ ఆలోచన విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్తూ, వారిని చైతన్యవంతులుగా మార్చేందుకు తన వంతు కృషి చేస్తానని చెప్పారు. తన నియామకానికి సహకరించిన టాస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జన్ను నర్సయ్య, లీగల్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు జయపాల్, నాయకులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

ఉర్దూ జర్నలిస్ట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఏర్పాటు

న్యూశాయంపేట: హనుమకొండలో గురువారం జరిగిన సమావేశంలో ఉమ్మడి వరంగల్ జిల్లా ఉర్దూ జర్నలిస్ట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అసోసియేషన్ అధ్యక్షుడిగా మహ్మద్ అక్బర్ మెహియొద్దీన్, వర్కింగ్ అధ్యక్షుడిగా మిర్జా ఫతఉల్లాబేగ్, ఉపాధ్యక్షుడిగా మహ్మద్ ఫజల్ ఉర్ రహమాన్ వాజిద్, ప్రధాన కార్యదర్శిగా మహ్మద్ ఇస్మాయిల్ జబీ, జాయింట్ సెక్రటరీలుగా సయ్యద్ సాదిఖ్ హుస్సేన్, మహ్మద్ అక్తర్ హుస్సేన్, కోశాధికారిగా మహ్మద్ హుస్సేన్ పాషా ఎన్నికయ్యారు.

కోమలకు డాక్టరేట్




కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ తెలుగు విభాగం పరిశోధకురాలు సంగాల కోమలకు యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. తెలంగాణ ఉద్యమ సాహిత్యం అనే అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి కోమలకు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ మల్లారెడ్డి తెలిపారు. ఆ విభాగం ప్రొఫెసర్ వేలూరి శ్రీదేవి పర్యవేక్షణలో కోమల తన పీహెచ్‌డీ పూర్తిచేశారు.

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు భవాని ఎంపిక



కరీమాబాద్: వరంగల్ రంగశాయిపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని పనికల భవాని.. రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైంది. పాఠశాలలో తొమ్మిదవ తరగతి చదువుతున్న భవాని ఇటీవల నిర్వహించిన ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి రెండవ స్థానం సాధించడంతో ఈ నెల 13నుంచి 15వ తేదీ వరకు మహబూబ్‌నగర్ జిల్లా వనపర్తిలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించనున్న అండర్ –17 ఖోఖో పోటీల్లో పాల్గొననుంది. ఈ సందర్భంగా ఆమెను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రామకృష్ణారెడ్డి, పీఈటీ గోగు నారాయణ గురువారం అభినందించారు.

మాస శివరాత్రి పూజలు



కాశిబుగ్గ: మాస శివరాత్రిని పురస్కరించుకుని వరంగల్ కాశిబుగ్గలోని కాశీ విశ్వేశ్వరాలయంలో అర్చకులు గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారు జామున మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, అర్చనలు, రుద్ర హోమం చేశారు. మధ్యాహ్నం స్వామి వారిని అన్నంతో అలంకరించి అన్నపూజ చేశారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

బెల్ట్ షాపులపై దాడులు

కాజీపేట: ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన నేపథ్యంలో పోలీసులు, ఎక్సైజ్ అధికారులు అప్రమత్తమయ్యారు. ఈక్రమంలో కాజీపేటని మద్యం దుకాణాల (బెల్ట్‌షాపులు)పై గురువారం దాడులు చేసి సుమారు రూ.10 వేల విలువైన మద్యాన్ని స్వాధీనం చేసుకుని నిందితులపై కేసులు నమోదు చేశారు. తనిఖీల్లో ఎక్సైజ్ సీఐ చంద్రమోహన్, సీఐ సార్ల రాజు, సిబ్బంది పాల్గొన్నారు.



హనుమకొండలోని సుబేదారిలోని ప్రభుత్వ హైస్కూల్‌లో బతుకమ్మ సంబరాల్లో విద్యార్థినులు



మడికొండలోని ప్రాథమిక పాఠశాలలో..



బొడ్డెమ్మ వేడుకల్లో చీఫ్ విప్ వినయ్‌భాస్కర్

ఘనంగా ముందస్తు బతుకమ్మ వేడుకలు

నగర వ్యాప్తంగా ముందస్తు బతుకమ్మ సంబరాలను గురువారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాలల్లో విద్యార్థినులు, ఉపాధ్యాయులు బతుకమ్మ ఆట పాటలతో రోజంతా సందడి చేశారు. విద్యార్థులకు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. అలాగే పలు ప్రాంతాల్లో సాయంత్రం బొడ్డెమ్మ వేడుకలు నిర్వహించారు.

– సాక్షి నెట్‌వర్క్



న్యూశాయంపేట ప్రభుత్వ పాఠశాలలో..



ఎక్సైజ్ కాలనీలోని స్పెక్ట్రా గ్లోబల్ స్కూల్‌లో..



వరంగల్ ఎల్‌బీనగర్‌లోని శ్రీచైతన్య పాఠశాలలో..



నయీంనగర్: కిషన్‌పుర మాస్టర్‌జీ స్కూల్‌లో..



గోపాలపురంలోని ఎస్‌ఎన్‌ఎస్ పాఠశాలలో..



కాజీపేట రహమత్‌నగర్‌లో..



హనుమకొండ రాగన్న దర్వాజ రజక వీధిలో..



మడికొండ మాస్టర్జీ పాఠశాలలో..

కాజీపేటలో పబ్లిక్ టాయిలెట్ ప్రారంభం



టాయిలెట్‌ను ప్రారంభించిన డీఆర్‌ఎం

కాజీపేట రూరల్: కాజీపేట జంక్షన్‌లో ప్రయాణికుల సౌకర్యార్థం నిర్మించిన సులభ్ పబ్లిక్ టాయిలెట్‌ను సికింద్రాబాద్ డివిజన్ రైల్వే మేనేజర్ (డీఆర్‌ఎం) భర్తేష్‌కుమార్ జైన్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సులభ్ పబ్లిక్ టాయిలెట్‌ను ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం అధికారులతో కలిసి కాజీపేట జంక్షన్‌లో వద్ద అభివృద్ధి పనులు, రైల్వే ఆస్పత్రి అభివృద్ధి పనులు, ఐఓహెచ్ షెడ్, డీజిల్‌షెడ్, ఫిట్‌లైన్‌ను తనిఖీ చేశారు. కాగా, సులభ్ పబ్లిక్ టాయిలెట్ ఏర్పాటుకు తాను ఎంతో కృషి చేశానని, అయితే ప్రారంభోత్సవానికి తనను పిలవకపోవడంపై అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నట్లు ఇన్‌స్టిట్యూట్ కమిటీ సెక్రటరీ దేవులపల్లి రాఘవేందర్ తెలిపారు.

నేడు సంఘీభావ యాత్ర

కాజీపేట రూరల్: అమెరికాలోని మేరీల్యాండ్‌లో ఈనెల 14న స్టాట్యూ ఆఫ్ ఈక్వాలిటీ పేరుతో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ 19 అడుగుల క్యాంస విగ్రహ ఏర్పాటును పురస్కరించుకొని జాతీయ మాల మహానాడు ఆధ్వర్యంలో నగరంలో శుక్రవారం బైక్‌ర్యాలీ నిర్వహించనున్నట్లు సంఘం నాయకులు మన్నె బాబురావు, అంకేశ్వరపు రాంచందర్‌రావు తెలిపారు. వరంగల్ ఎంజీఎం సెంటర్ నుంచి కాజీపేట రైల్వే స్టేషన్ వరకు బైక్‌ర్యాలీ కొనసాగుతుందని వివరించారు.

ఆటో డ్రైవర్ నిజాయితీ



బాధితురాలికి బ్యాగు అప్పగిస్తున్న ఎస్సై లలిత

కాజీపేట: బంగారు నగలతో పాటు విలువైన కాగితాలను మరిచిపోయిన బాధితురాలికి పోలీసుల సమక్షంలో బ్యాగును అందించి ఆటో డ్రైవర్ తన నిజాయితీని చాటుకున్నాడు. గురువారం ట్రిసిటీ ఆటో యూనియన్ నాయకుడు అరూరి రవీందర్ ఆటోలో హనుమకొండ నుంచి ప్రయాణించిన ఓ మహిళ తన వెంట తెచ్చుకున్న బ్యాగును మరిచిపోయి హడావిడిగా కాజీపేట చౌరస్తాలో దిగిపోయింది. ఈ తర్వాత ఆటోలో బ్యాగు ఉన్నట్లు రవీందర్ గుర్తించి స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎస్సై లలితకు అప్పగించారు. అనంతరం బాధితురాలికి అందజేశారు. ఈ సందర్భంగా ఆటో డ్రైవర్‌ను పలువురు అభినందించారు. కార్యక్రమంలో సీఐ సార్ల రాజు, ముచ్చు భిక్షపతి, జేరిపోతుల వెంకన్న, బండి రాంచందర్, సందెల పైడి, ఎండీ.సోని, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రూ.10 లక్షల బీమా చెక్కు పంపిణీ



చెక్కు అందజేస్తున్న డీజీఎం వివేక్‌చంద్ర జైస్వాల్

కాజీపేట: ఇటీవల ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో మృతి చెందిన బాధిత కుటుంబానికి కాజీపేట ఎస్‌బీఐ బ్యాంక్ డీజీఎం వివేక్‌చంద్ర జైస్వాల్ రూ.10 లక్షల బీమా చెక్కును గురువారం అందజేశారు. కోడవాటి సారయ్య అనే భవన నిర్మాణ కార్మికుడు విధి నిర్వహణలో విద్యుదాఘాతంతో మృతి చెందాడు. అతని పేరుపై బ్యాంక్‌లో ప్రమాద బీమా ఇన్సూరెన్స్ ఉండడంతో మంజూరైన చెక్కును మృతుడి భార్య సుమలతకు అందించారు. కార్యక్రమంలో ఏజీఎం రఘునాథ్, కాజీపేట బ్రాంచి మేనేజర్ షానాజ్ బేగం, ఇన్సూరెన్స్ మాడ్యుల్ మేనేజర్ ఎస్.మహేశ్వర్ రెడ్డి, దేవేందర్ రెడ్డి, సీహెచ్ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

'మార్క్స్ – అంబేడ్కర్.. మార్గదర్శకులు'



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న సాహితీవేత్తలు

హన్మకొండ: లాల్ నీల్ మైత్రి వేదిక ఆధ్వర్యంలో ఈనెల 15న మార్క్స్ – అంబేడ్కర్ మన మార్గదర్శకులు అనే పుస్తకాన్ని ఆవిష్కరించనున్నట్లు లాల్ నీల్ మైత్రి వేదిక ఉమ్మడి వరంగల్ జిల్లా కన్వీనర్ చంద్రమౌళి తెలిపారు. హనుమకొండలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద సదస్సు, పుస్తకావిష్కరణ కార్యక్రమ కరపత్రాలను గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హనుమకొండలోని ప్రెస్‌క్లబ్‌లో జరిగే సదస్సులో ఈ పుస్తకాన్ని ఆవిష్కరించనున్నట్లు తెలిపారు. సదస్సులో వివిధ అంశాలపై ప్రొఫెసర్ అబ్దుల్ నూర్ బాషా, డాక్టర్ ఎంఎఫ్.గోపినాథ్, బొజ్జ భిక్షమయ్య, జిలకర శ్రీనివాస్ ప్రసంగిస్తారని వివరించారు. కార్యక్రమములో డాక్టర్ వెంగల్ రెడ్డి, డాక్టర్ మార్క శంకర్ నారాయణ, భిక్షపతి, బ్రహ్మచారి నిది, ప్రవీణ్ కుమార్, ప్రకాశం, ఓంబ్రహ్మం, మాస్ సావిత్రి, జయశ్రీ, సోమయ్య పాల్గొన్నారు.

లక్ష్యాన్ని ఎంచుకొని చదువుకోవాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న శర్మ

మామునూరు: విద్యార్థులు లక్ష్యాన్ని ఎంచుకుని కష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్ సొంతమవుతుందని ప్రొఫెసర్, డీన్ ఎస్‌ఎస్‌వీఎన్ శర్మ, వైస్ ప్రిన్సిపాల్, డాక్టర్ తిరుపతిరావు, డాక్టర్ కళాశాల డీన్ ఎం.శశిధర్, డాక్టర్ శివశంకర్ సూచించారు. ఈమేరకు ఖిలా వరంగల్ మండలం బొల్లికుంట వాగ్దేవి కళాశాలలో డాక్టర్ భాస్కర్‌రావు ఆధ్వర్యంలో నూతన ప్రవేశాల పొందిన ఎంబీఏ, ఎంసీఏ విద్యార్థులకు గురువారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కళాశాలలోని వనరులను ఉపయోగించుకుని విద్యార్థులు తమ జీవిత లక్ష్య సాధన కోసం మరింతగా కష్టపడాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ ఎం.మురళి, డాక్టర్ సరోజ, ముక్తేశ్వర, డాక్టర్ భార్గవి, డాక్టర్ స్రవంతి, డాక్టర్ వేణురెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో ఇద్దరికి జైలు

కాజీపేట: కాజీపేట డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన 14మందిలో ఇద్దరికి రెండు రోజులపాటు జైలుశిక్ష, 12మందికి జరిమానా విధిస్తూ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ విద్యాసాగర్ రావు గురువారం తీర్పునిచ్చారు. స్థానిక సీఐ సుజాత కథనం ప్రకారం డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన 14మందిని కోర్టులో హాజరుపర్చినట్లు తెలిపారు. ఎండీ.అంకూస్, వల్లెపు చేరాలుకు రెండు రోజుల జైలు, 12 మందికి రూ.16,300 జరిమానా విధించినట్లు వివరించారు.

సంక్షిప్తంగా

లెక్చరర్ల సమస్యలు పరిష్కరించాలి

హసన్‌పర్తి: ప్రైవేట్ కళాశాలల లెక్చరర్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సంకెపల్లి శ్రీనివాస్‌రెడ్డి డిమాండ్ చేశారు. భీమారంలోని మాతృశ్రీ మహిళా డిగ్రీ కళాశాలలో తెలంగాణ ప్రైవేట్ కాలేజెస్ లెక్చరర్ల అసోసియేషన్ కార్యవర్గ సమావేశం గురువారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేట్ కళాశాలల లెక్చరర్లు అరకొర జీతాలతో దుర్భర జీవితాన్ని గడుపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సంఘం రాష్ట్ర కమిటీ సహాయ కార్యదర్శి రాజేంద్రప్రసాద్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో వరంగల్ జిల్లా అధ్యక్షుడు అనిల్‌రెడ్డి, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు రమేష్, ప్రధాన కార్యదర్శి సోమేశ్వర్‌రావు, మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడు నీలం వెంకటేశ్వర్లు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఆ ఉపాధ్యాయులను వెనక్కి రప్పించాలి

విద్యారణ్యపురి: హనుమకొండ జిల్లాలో ప్రభుత్వ, జిల్లా పరిషత్ బాలికల హైస్కూల్స్‌లో పనిచేస్తున్న 50ఏళ్ల లోపు వయస్సు గల పురుష ఉపాధ్యాయులను వెనక్కి రప్పించి, బాలుర ఉన్నత పాఠశాలలకు పంపాలని టీయూటీఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షుడు నూతనకంటి బాబు, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు భిక్షపతి, బాధ్యులు కోరారు. ఈమేరకు హనుమకొండలోని పాఠశాల విద్యాశాఖ ఆర్‌జేడీ కార్యాలయంలో ఏడీ రంగయ్యనాయుడికి గురువారం వినతిపత్రం అందజేశారు.

సీపీ రంగనాథ్ సేవలు మరువలేనివి

కాశిబుగ్గ: వరంగల్ పోలీస్ కమిషనర్‌గా సీపీ రంగనాథ్ చేసిన సేవలు మరువలేనివని కాశిబుగ్గకు చెందిన దివ్యాంగుడు సయ్యద్ అసద్ అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా జరిగిన బదిలీల్లో భాగంగా సీపీ రంగనాథ్ బదిలీ కావడంతో సీపీని గురువారం అసద్ మర్యాదపూర్వకంగా కలిసి బొకే అందజేశారు.

'తాళ్ల పద్మావతి'లో ముగిసిన వర్క్‌షాప్

కరీమాబాద్: వరంగల్ ఉర్సుగుట్ట తాళ్ల పద్మావతి కళాశాలలో నిర్వహిస్తున్న క్లినికల్ ఫార్మసీ వర్క్‌షాప్ గురువారం ముగిసింది. ఈ సందర్భంగా వెబినార్‌లో 'అవెనిడా ఇన్నోవేషన్స్' చైర్మన్ డాక్టర్ అశ్వనీధర్ మాట్లాడుతూ వాతావరణ పరిస్థితులు, ఆహారపు అలవాట్లతోపాటు మానవుల జీవన శైలిలో వస్తున్న మార్పుల కారణంగా మానవాళికి వస్తున్న అంతుచిక్కని వ్యాధులు వైద్యరంగానికి సవాల్ విసురుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. డాక్టర్ కార్తీక్, డాక్టర్ భగీరథ్, డాక్టర్ ప్రణయ్, విద్యాసంస్థల చైర్మన్ తాళ్ల మల్లేశం, డైరెక్టర్ తాళ్ల వరుణ్, శంకర్, ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటేశ్వర్‌రావు, డాక్టర్ బేతి శ్రీనివాస్, చిన్నపరెడ్డి, డాక్టర్ రఘు, డాక్టర్ రాజేశ్, డాక్టర్ విశ్వప్రశాంత్, డాక్టర్ అర్చన పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్ ఉల్లంఘనపై చర్య తీసుకోవాలి

కాశిబుగ్గ: ఎన్నికల కోడ్ అమలులో ఉన్న సమయంలో అధికార పార్టీ నాయకుల అండదండలతో వరంగల్ దయానందకాలనీలోని కనకదుర్గ మాత దేవాలయం కమిటీ నియామక ఉత్తర్వులు విడుదల చేసిన ఉమ్మడి వరంగల్ జిల్లా దేవాదాయశాఖ అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆలయ అభివృద్ధి కమిటీ నాయకులు మీసాల ప్రకాశ్ కోరారు. ఈమేరకు కలెక్టరేట్‌లో గురువారం ఫిర్యాదు చేశారు.

మహాసభలను విజయవంతం చేయాలి

హసన్‌పర్తి: ఈనెల 15వ తేదీ నుంచి మూడు రోజులపాటు మహబూబ్‌నగర్‌లో నిర్వహించనున్న రాష్ట్ర విద్యా, వైజ్ఞానిక రజతోత్సవ మహాసభలను విజయవంతం చేయాలని డీటీఎఫ్ హసన్‌పర్తి మండల అధ్యక్షుడు గోపగాని రాజయ్య పిలుపునిచ్చారు. ఈమేరకు హసన్‌పర్తి మండల కేంద్రంలో గురువారం జరిగిన కార్యక్రమంలో డీటీఎఫ్ జిల్లా కౌన్సిలర్ భాస్కర్‌రెడ్డి, మండల కమిటీ సభ్యులు రవినాయక్, రమేష్, కోటయ్య, సాంబయ్య, అజయ్, రాములు తదితరులు పాల్గొన్నారు.

త్వరలో మా మద్దతు ఎవరికో చెబుతాం..

నయీంనగర్: తాము ఏ పార్టీకి మద్దతు ఇస్తామో త్వరలో తెలంగాణ రాష్ట్ర కోర్ కమిటీ సమావేశంలో జాతీయ అధ్యక్షుడు కొంగర అనిల్ తెలుపుతారని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ మహాసేన రాష్ట్ర అధ్యక్షుడు రాచపెల్లి ధర్మేందర్ తెలిపారు. హనుమకొండ ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ధర్మేందర్ మాట్లాడుతూ తాము మద్దతు తెలిపిన రాజకీయ పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో దామెర కరుణ, ప్రభాకర్, పూర్ణ తదితరులు పాల్గొన్నారు.

రైల్వే సీసీఎస్ ఎన్నికల్లో గెలుపునకు కృషి

కాజీపేట రూరల్: కాజీపేట జంక్షన్‌లో ఈనెల 19న జరగనున్న రైల్వే సీసీఎస్ ఎన్నికల్లో రైల్వే మజ్దూర్ యూనియన్ బలపరిచిన ప్యానెల్ గెలుపే ధ్యేయంగా కృషి చేస్తున్నట్లు మజ్దూర్ యూనియన్ సికింద్రాబాద్ జోనల్ ప్రెసిడెంట్ శ్రీనివాస్, రైల్వే ఓబీసీ అసోసియేషన్ జోనల్ ప్రెసిడెంట్ సంతోష్‌కుమార్ ధీమా వ్యక్తం చేశారు. కాజీపేట దర్గా గేట్ నంబర్ –1తో పాటు ఇతర రైల్వే కార్యాలయాల్లో గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో సమ్మయ్య, బాలముని రాజు, ఎక్బాల్ జాఫర్, శ్రీనివాస్, సునీల్, రాఘవేందర్, శ్రీనివాస్ యాదవ్, రాజేందర్, నాగరాజు, రాజు, అనిల్, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

14వ డివిజన్‌లో ఇంటింటా ప్రచారం

వరంగల్: నగరంలోని 14వ డివిజన్ ఏనుమాముల బాలాజీ నగర్‌లో బీఆర్‌ఎస్ పార్టీ సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో గురువారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. వర్ధన్నపేట ఎమ్మెల్యేగా అరూరి రమేష్‌ను మరోసారి గెలిపించాలని నాయకులు, కార్యకర్తలు కోరుతూ ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో నాయకులు తూర్పాటి సారయ్య, పత్రి సుభాష్, గంధం గోవిందు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

ఖిలా వరంగల్: వరంగల్ అండర్ బ్రిడ్జి రోడ్డుపై గురువారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో వరంగల్ శివనగర్‌కు చెందిన బుదారపు కనకయ్య (60)కు తీవ్ర గాయాలయ్యాయి. సంఘటన స్థలానికి మిల్స్‌కాలనీ పోలీసులు చేరుకుని వివరాలు సేకరించినట్లు తెలిసింది.

రోడ్డుపై గేదె మృతి

ఖిలా వరంగల్: వరంగల్ 34వ డివిజన్ శివనగర్‌లోని బొర్రయ్య వీధిలో గురువారం పాడి గేదె కిందపడి అక్కడికక్కడే మృతి చెందింది. ప్రజల అభ్యర్థన మేరకు కార్పొరేటర్ దిడ్డి కుమారస్వామి స్పందించి గేదెను జేసీబీ సహాయంతో ట్రాక్టర్‌లో తీసుకెళ్లి రాంపూర్ డంపింగ్ యార్డ్‌లో గోతి తీసి పాతిపెట్టారు.

దళితుల అంశాలను మేనిఫెస్టోలో చేర్చాలి



సమావేశంలో మాట్లాడుతున్న శంకర్

హన్మకొండ: దళితుల సాధికారతకు ఉపయోగపడే అంశాలు, చేపట్టే పథకాలు, సంక్షేమ కార్యక్రమాలను రాజకీయ పార్టీలు తమ ఎన్నికల మేనిఫెస్టోలో చేర్చాలని దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి శంకర్ అన్నారు. హనుమకొండలో దళిత బహుజన ఫ్రంట్, ప్రజా సంఘాల ముఖ్య నాయకుల సమావేశం గురువారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాలని, విశ్వవిద్యాలయాల పట్ల వివక్షను విడనాడలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలలు, హాస్టళ్లు, గురుకులాల్లో కనీస సదుపాయాలు కల్పించాలని కోరారు. కేజీ నుంచి పీజీ వరకు ఉచిత నాణ్యమైన విద్యనందించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో కేయూ జేఏసీ చైర్మన్ డాక్టర్ మంద వీరస్వామి, దళిత బహుజన ఫ్రంట్ రాష్ట్ర కార్యదర్శి చుంచు రాజేందర్, ఉపాధ్యక్షుడు సిలువేరు భిక్షపతి, రాష్ట్ర మహిళా కార్యదర్శి బొర్ర సంపూర్ణ, నాయకులు కొమ్ముల కరుణాకర్ పాల్గొన్నారు.

అక్షరాస్యతను పెంపొందించేందుకు వయోజన విద్య



మాట్లాడుతున్న పాస్టర్ కరుణాకర్

కాజీపేట అర్బన్: నిరక్షరాస్యుల్లో అక్షరాస్యతను పెంపొందించేందుకు వయోజన విద్యా కేంద్రాలు ఎంతగానో దోహదపడతాయని రెవరెండ్ పాస్టర్ బొందుగుల కరుణాకర్ తెలిపారు. కాజీపేట మండలం కొత్తపల్లి గ్రామంలో స్ఫూర్తి సేవా సదన్ ఆధ్వర్యంలో గురువారం ఏర్పాటు చేసిన ఐదు వయోజన విద్యా కేంద్రాలను కరుణాకర్ ప్రారంభించి మాట్లాడారు. నేటి సమాజంలో అన్ని వర్గాల ప్రజలకు అక్షరాస్యతను పెంపొందించేందుకు, స్వీయ ఉపాధి కల్పించేందుకు అక్షరం జ్ఞానం తోడ్పడుతుందని చెప్పారు. కార్యక్రమంలో ప్రవీణ్‌కుమార్, పోలెపాక సబిత, వెంకటస్వామి, స్వప్న, సంధ్య, యుగందర్, రజనీకర్‌రెడ్డి, స్వామి, తదితరులు పాల్గొన్నారు.

సీ విజిల్ యాప్‌ను తెలుగులో అందించాలి

హన్మకొండ: ఎన్నికల్లో జరిగే అక్రమాలు, కోడ్ ఉల్లంఘనలపై ఫిర్యాదు చేసేందుకు తీసుకువచ్చిన సీ – విజిల్ యాప్‌ను తెలుగులో కూడా అందించాలని బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ కోరారు. ఈమేరకు ఎన్నికల కమిషన్, రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌కు ఎక్స్ (ట్విట్టర్) వేదికగా విన్నవించారు. ఎన్నికల నిబంధనల అతిక్రమణలు ఫిర్యాదు చేయడానికి సీ – విజిల్ చాలా ఉపయోగకరమైన యాప్ అని పేర్కొన్నారు. ఈ యాప్ 8 భాషల్లో అందుబాటులో ఉందని, అయితే తెలుగు భాషలో మాత్రం అందుబాటులో లేదని తెలిపారు. దక్షిణ భారతదేశంలో కన్నడ, మలయాళం, తమిళ భాషల్లో అందుబాటులో ఉన్నప్పుడు తెలుగులో ఎందుకు ఉండకూడదని ప్రశ్నించారు.

మంత్రిని కలిసిన దసరా ఉత్సవ కమిటీ



మంత్రి దయాకర్‌రావుతో కమిటీ సభ్యులు

కరీమాబాద్: రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావును ఉర్సు కరీమాబాద్ దసరా ఉత్సవ కమిటీ సభ్యులు గురువారం కలిసి బతుకమ్మ, దసరా వేడుకల విజయవంతానికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు నాగపురి సంజయ్‌బాబు, మేడిది మధుసూదన్, మండ వెంకన్న, వొడ్నాల నరేందర్, వంగరి కోటేశ్వర్, శివమూర్తి, రాంప్రసాద్, రంజిత్, సందీప్ తదితరులు పాల్గొన్నారు. కాగా, రంగలీల మైదానంలో వైభవంగా వేడుకలు నిర్వహించాలని వారికి మంత్రి సూచించారు.

విద్యార్థులు దేశభక్తి కలిగి ఉండాలి



కేయూ క్యాంపస్: విద్యార్థులు దేశభక్తి కలిగి ఉండాలని కాకతీయ యూనివర్సిటీ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్.ప్రసాద్ అన్నారు. ఫార్మసీ కళాశాలలో జాతీయ సేవాపథకం (ఎన్‌ఎస్‌ఎస్) ఆధ్వర్యంలో మేరీ ముట్టి.. మేరా దేశ్ అనే కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ భావన, దేశం పట్ల గౌరవం, ఈ నేలపై అభిమానం జీవితాంతం ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ సుజాత, డాక్టర్ సునీత, శశిధర్ పాల్గొన్నారు.

ఆర్థరైటిస్‌పై అవగాహన



నయీంనగర్: ఆర్థరైటిస్ డే సందర్భంగా హనుమకొండ లష్కర్‌బజార్‌లోని డాక్టర్ నరేష్ రుమటాలజీ సెంటర్‌లో ఆర్థరైటిస్‌పై రోగులకు గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కీళ్ల నొప్పులు, వేళ్ల వాపులు, మెడ, నడుము నొప్పితో బిగుసుకుపోవడం వంటి వ్యాధులపై డాక్టర్ నరేష్ అవగాహన కల్పించి, చికిత్స, నివారణ పద్ధతులను వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ విష్ణు, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.